మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
దశాబ్ది ఉత్సవాలు - 2025 | 10 ANNIVERSARY Celebration | www.tmedia.net.in
సంపుటి : 8
సంచిక : 34
పేజీలు : 3
గురువారం 21.08.2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మండల / నియోజక వర్గం /
జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టీ-మీడియా సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
epaper,www.tmedia.net.in YouTube facebook

## అభివృద్ధిని అడ్డుకునే వారికి
# ప్రజలే అడ్డుకట్ట వేయాలి





## రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

**టీ మీడియా, ఆగస్ట్ 20, హైదరాబాద్ బ్యూరో :** రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా వ్యవహరించిన నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని అన్నారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాద్‌ను అప్పటి ముఖ్యమంత్రులు అభివృద్ధి చేసినట్లు ఆయన వెల్లడించారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

### మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారు?

గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని పలు సంస్థలు నిర్మించారని ఆయన గుర్తు చేశారు. హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారని అన్నారు. హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోందని, మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పని చేయడం కావాలని, అమెరికాలో మన ఐటీ నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చామని, రాబోయే పది సంవత్సరాల్లో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారని, మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందామని, మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ జరగాలని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవని, అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిస్తుందని వివరించారు.

### పాతబస్తీ ఒరిజినల్ సిటీ

హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకొనే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలని, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ ప్రక్షాళన కొంతమందికి ఇష్టం లేదని, తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పాత బస్తీ ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని చెప్పారు. మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించబోతున్నామని, రాష్ట్ర ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నామని అన్నారు. నగర అభివృద్ధి అడ్డుకునే వారు మనకు శత్రువేనని, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలని రేవంత్ వ్యాఖ్యానించారు.

## రెండేళ్లలో 9 లక్షల
# ఇళ్ల నిర్మాణం

- సంక్రాంతికి 2 లక్షల ఇళ్లు అందజేత
- గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబుసమీక్ష



**టీ మీడియా, ఆగస్ట్ 20,అమరావతీ బ్యూరో:**2029 కల్లా అర్హులైన పేదందరికీ ఇళ్లు నిర్మాణం పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వచ్చే 2 ఏళ్లలో మొత్తంగా 9 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ 2.81లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. సెప్టెంబర్ 15 కల్లా 3 లక్షల ఇళ్లు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు.దాదాపు 6 లక్షల మందికి ఇంకా గృహ అవసరాలు ఉన్నట్లు సర్వే ద్వారా గుర్తించామని మంత్రి వెల్లడించారు. గృహ అవసరాలకు సంబంధించి కేంద్రం నుంచి వచ్చిన దాదాపు రూ.3 వేల కోట్లను గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం మళ్లించిందని ఆరోపించారు. గత ప్రభుత్వ అవకతవకలుపై విజిలెన్స్ విచారణ పూర్తయిందని నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడ్కో ఇళ్లను వైఎస్సార్సీపీ నాశనం చేసిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మండిపడ్డారు. విధి విధానాలను మార్చేసి పట్టణ పేదలకు తీవ్ర నష్టం చేకూర్చి అవకతవకలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ పాపాలు భరిస్తూనే: తాము కట్టిన ఇళ్లకు వైఎస్సార్సీపీ రంగులు వేసుకుని ఆ బిల్లులు కూడా కాంట్రాక్టర్లకు ఎగ్గొట్టిందని ఆరోపించారు. ఇంటి లబ్ధిదారుల పేరిట బిల్లులు సృష్టించి ఆ నిధుల్ని ఏం చేశారో కూడా తెలియలేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ పాపాలు భరిస్తూనే తిరిగి ఇళ్ల నిర్మాణం చేపట్టామని అన్నారు. దాదాపు రూ.3666 కోట్లు పెండింగ్ బిల్లులు ఇతరత్రా కలిపి దాదాపు రూ.5 వేల కోట్లపైనే భారం పెట్టి పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బంది పడకూడదన్న సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులందరికీ న్యాయం చేసే దిశగా ముందుకెళ్తున్నామని మంత్రి నారాయణ అన్నారు.





# గోదావరికి పోటెత్తుతున్న వరద

### సుడులు తిరుగుతూ సముద్రం వైపు

**టీ మీడియా, ఆగస్ట్ 20,తూర్పు గోదావరి:** జిల్లాలోని ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సుమారు తొమ్మిదిన్నర లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదలడంతో వృద్ధ గౌతమి, గౌతమీ గోదావరి నది పాయలు పోటెత్తుతున్నాయి. డాక్టర్ బీఆర్? అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ పోలవరం మండలం పరిధిలోని పశువుల్లంక వారధి వద్ద గోదావరి నది ప్రవాహం సుడులు తిరుగుతూ సముద్రం వైపు పారుతోంది. ఈ ప్రవాహ వేగానికి సారవంతమైన లంక భూములు కోతకు గురై వరద నీటిలో కలిసిపోతున్నాయి. లంకభూములే జీవనాధారంగా కొబ్బరి, ఇతర మెట్ట పంటలు పండించుకుంటూ జీవనం సాగించే చిన్న చిన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎదురులంక వద్ద గౌతమీ నదీపాయకు రూ.80 కోట్లతో సుమారు 2 కిలోమీటర్లు రివిట్?మెంట్ పనులు చేపట్టి లంక భూముల కోతలకు అడ్డుకట్టు వేసింది. అదే విధంగా మిగతా ప్రాంతాల్లోనూ పనులు చేపట్టాలని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.




### పడవల ద్వారానే రాకపోకలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని సిద్ధాంతంలో వద్ద వశిష్ఠ గోదావరిలో నీటి మట్టం గడిచిన 24 గంటల్లో 5 అడుగుల మేర పెరిగింది. ఇప్పటికిప్పుడు ప్రమాదకర పరిస్థితి లేకపోయినా ఎగువ ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండటంతో వరద ఉద్ధృతి కొనసాగే అవకాశం ఉందని లంక గ్రామాల ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాలని అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఆచంట మండలంలో అనగార్లంక, పెదమల్లం లంక, ఏటిదరి కోడేరులంక, మర్రిమూల, పుచ్చల్లంక గ్రామాల ప్రజలు పడవల ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 9.50 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు.మునిగిన గండి పోచమ్మ ఆలయం: అల్లూరి జిల్లా ఎటపాక సరిహద్దు వద్ద గోదావరి నీటి ప్రవాహం 43 అడుగుల ప్రమాద స్థాయికి చేరుకుంది. అధికారులు ఒకటవ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గండి పోచమ్మ గుడి పూర్తిగా గోదావరి నీటిలో మునిగింది. చుట్టుపక్కల షెడ్లన్నీ గోదావరి జలాల్లో మునిగిపోయాయి. ప్రతివారం గండి పోచమ్మ దేవాలయాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. పాడేరు డివిజన్లో వరి పొలాలు నీట మునిగాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ పైనుంచి వచ్చే వరద నీటితో కొన్ని ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి.

# సీఎం రేవంత్‌కు తలనొప్పిగా మారిన ఇద్దరు ఎమ్మెల్యేలు





**టి మీడియా, ఆగస్టు 20, హైదరాబాద్ బ్యూరో :** పవర్‌లో ఉన్నా..ప్రతిపక్షంలో ఉన్నా..సీఎం రేవంత్‌కు అప్పుడు..ఇప్పుడు ఇద్దరితో ఇక్కట్లు తప్పడం లేదట. పైగా వాళ్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలు అయి ఉండి..నెగెటివ్ రాగం వినిపిస్తుండటం రేవంత్‌కు ఇరిటేషన్‌గా మారిందట. అలా అని వారిని ఏం అనలేని పరిస్థితి ఉందట. పొమ్మని పార్టీ నుంచి పంపే పరిస్థితిలేదు. అలాగని వారితో కలిసి డయాస్ షేర్ చేసుకునే సిచ్యువేషన్ లేదట.అందులో ప్రధానంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఛాన్స్ దొరికిన ప్రతీసారి సీఎంపై చిందులు తొక్కుతున్నారు. మంత్రి పదవిని రానివ్వకుండా అడ్డకున్నారంటూ రేవంత్‌పై బాణాలు వదులుతున్నారు. మొదట్లో ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు రాజగోపాల్‌రెడ్డి. ఆ తర్వాత ఇన్ డైరెక్ట్ కామెంట్స్‌తో హీట్ క్రియేట్ చేసి ఇప్పుడు ఏకంగా సీఎం రేవంత్‌తో తాడోపేడో అన్నట్లుగా మాటల తూటాలు పేలుస్తున్నారు.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం అలా ఉంటే..మరో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాటలతో కాకుండా చేతలతో సీఎం రేవంత్ ను ఇరకాటంలో పెడుతున్నారట. సీఎం స్థాయిలో రేవంత్ రెడ్డి అటెండ్ అయ్యే సమావేశమేదైనా ఆయన దుమ్మా కొడుతున్నారు.ముఖ్యమంత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహిస్తే..మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ హాజరైతే..జిల్లాలో నియోజకవర్గంలో ఉండి కూడా దొంతి మాధవరెడ్డి అటువైపు చూడలేదు.రేవంత్ పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు దొంతి మాధవరెడ్డి కూడా ఆయన పాదయాత్రను నర్సంపేటకు రాకుండా అడ్డుకున్నారన్న ప్రచారం ఉంది. పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పటి నుంచి రేవంత్‌ను వ్యతిరేకిస్తున్న దొంతి..ఇప్పుడు సీఎం హోదాలో రేవంత్‌ను లైట్ తీసుకుంటున్నారన్న చర్చ ఉంది.

### కొరకరాని కొయ్యలా మరో ఇద్దరు నేతలు

ఇప్పుడు ఈ ఇద్దరి తీరుతో గతంలో చోటు చేసుకున్న పరిణామాలు తెరపైకి వస్తున్నాయి. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్న సందర్భంలో మరో ఇద్దరు నేతలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జగ్గారెడ్డిలు కొరకరాని కొయ్యలాగా వ్యవహరించే వారు. పీసీసీ చీఫ్‌గా రేవంత్ నియామకం అయిన కొత్తలో..డబ్బులు ఇచ్చి పోస్ట్ తెచ్చుకున్నారని వెకంట్‌రెడ్డి డైరెక్ట్ అటాక్ చేశారు.ఆ తర్వాత మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ఆ తర్వాత కూడా రేవంత్‌పై డైలాగులు పేల్చారు. కానీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రి అయిన తర్వాత వెంకట్ రెడ్డి పూర్తిగా మారిపోయారు. రేవంత్ రెడ్డి ఈ ఐదేళ్లే కాదు.. వచ్చే ఐదేళ్లు కూడా సీఎంగా ఉండాలని గణపతి హోమం చేయిస్తున్నానంటూ బహిరంగంగా కామెంట్స్ చేశారు. ఇక జగ్గారెడ్డి అయితే అప్పట్లో రేవంత్ రెడ్డిపై ఒంటికాలిపై లేచేవారు. సీఎం రేవంత్ రెడ్డిపై, ప్రభుత్వంపై ఎవరు విమర్శలు చేసినా.. జగ్గారెడ్డి ముందుండి తిప్పికొడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇప్పుడు జగ్గారెడ్డి, వెంకట్‌రెడ్డి ఇద్దరూ సీఎం రేవంత్ రెడ్డి ఈగ వాలనీయడం లేదు.

ఇలా రేవంత్ రెడ్డి పీసీసీగా ఉన్నప్పుడు కొరకరాని కొయ్యలా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగ్గారెడ్డిలు ఇప్పుడాయనకు అనుకూలంగా మారారు.ఇప్పుడు వారి రోల్‌లో కొత్తగా ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి రేవంత్‌కు కంట్లో నలుసులా మారారట. ఆ ఇద్దరి నేతల మాదిరిగా ఈ ఇద్దరిలో కూడా ఏమైనా మార్పు వస్తుందా లేదా అనేది చూడాలి మరి

## మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి



**టీ మీడియా, ఆగస్టు 20, రామకృష్ణాపూర్:** రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 81వ జయంతిని బుధవారం స్థానిక రాజీవ్ చౌక్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి,కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు టిపిసిసి సభ్యులు రఘునాథరెడ్డి వాళ్లు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ విద్యారంగంలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకువచ్చారని,ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక పార్టీ నుండి మరో పార్టీలోకి చేరకుండా ప్రజస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో పార్టీ ఫిరాయింపుల చట్టం తీసుకువచ్చారని,దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన మహా నాయకుడు అని కొనియాడారు. రైతులకు పేదవారికి అండగా ఉంటుంటే కక్షపూరితంగా బిజెపి కేంద్రం రైతులకు ఇవ్వాల్సింది 8 లక్షల టన్నులు యూరియా అయితే,రాష్ట్రానికి నాలుగు లక్షల టన్నుల యూరియా మాత్రమే పంపిణీ చేసి తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తుందని,బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ జంగం కళ, గాండ్ల సమ్మయ్య,శ్యామ్ గౌడ్,పుల్లూరి కళ్యాణ్, గోపు రాజం, బత్తుల వేణు,బుడిగే శ్రీను,బొద్దుల ప్రేంసాగర్,కట్ల రమేష్,మహిళ నాయకురాలు శారద,కమల,లత తదితరులు పాల్గొన్నారు.

## చవితి ముగిసేవరకు డీజే లకు అనుమతులు లేవు

**-పట్టణ ఎస్సై రాజశేఖర్**



**టీ మీడియా, ఆగస్ట్ 20, రామకృష్ణాపూర్:**వినాయక చవితి పండగను పురస్కరించుకొని వినాయకుడి ప్రతిష్టాపన చేసిన రోజు నుండి నిమజ్జనం పూర్తి అయ్యేవరకు భక్తులందరు శాంతియుతంగా, ప్రశాంతమైన వాతావరణంలో పండగ జరుపుకోవాలని బుధవారం పట్టణ ప్రజలకు ఆర్కెపి ఎస్సై తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై పట్టణంలో గల డీజే నిర్వహకులను ఆర్కెపి పోలీస్ స్టేషన్ లో అవగహన కార్యక్రమం చేపట్టి వారందరితో మాట్లాడి,వినాయక చవితి పండగకు మండపాల వద్ద, నిమజ్జన సమయంలో ఊరేగింపులో డీజే అనుమతి లేదని,పెట్టవద్దని అందరికి చెప్పారు.ఎవరైనా ఉత్తర్వులు అతిక్రమించి డీజే లు పెట్టినట్లయితే వారి మీద చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**-డీపీవో వెంకటేశ్వర్ రావు**



**టీ మీడియా, ఆగస్ట్ 20,తాండూర్ :** జిల్లాలోని పంచాయతీ అధికారులు, కార్యదర్శులు విధుల్లో అలసత్వం వహిస్తూ పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డీ వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. మండలంలోని రెచిని, గోపాల్ నగర్, తాండూర్ గ్రామ పంచాయతీలను డీపీవో ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాలనీల్లో పర్యటించి పారిశుధ్యపనుల నిర్వహణను పరిశీలించారు.తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో పర్యటించిన ఆయన పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త అపరిశుభ్రమైన వాతావరణాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శి దొంద దివాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలని, మురుకి కాలువలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారఉ. పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని ఆదేశించారు.చెత్తను బయట వేసే దుకాణదారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని, పలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న వార్డుల స్థాయి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ, గ్రామపంచాయతీ అవార్డ్స్ డేటాను పరిశీలించారు. డీపీవో వెంట ఎంపీవో అనిల్ కుమార్, కార్యదర్శులు దివాకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, పంచాయతీ కంప్యూటర్ అపరేటర్లు కుమారస్వామి, కిషోర్ ఉన్నారు

## వరద నష్టాల నివారణకు చర్యలు

**-మంత్రి జూపల్లి కృష్ణారావు**




**టీ మీడియా, ఆగస్ట్ 20,ఆసిఫాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జరిగిన వరద నష్టాల నివారణకు ( అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆబ్కారీ మధ్య నిషేధ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వరద నష్టాల నివారణకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాల వల్ల జిల్లాలో ప్రాథమిక అంచనా ప్రకారం 6 వేల 450 ఎకరాల్లో పత్తి, వరి, ఇతర పంటలకు నష్టం జరిగిందని వెల్లడించారు. సుమారు 3 ,100 మంది రైతులు పంటలను నష్టపోయారని తెలిపారు. పంట నష్టం, పశు నష్టంపై పూర్తిస్థాయిలో నివేదిక సమర్పించాలని తెలిపారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని రహదారులు కొంతమేర ధ్వంసం కావడం, అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయిన చోట త్వరగా మరమ్మతులు చేపట్టి రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజానీకం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని వట్టి వాగు కాలువలకు గండిపడి రైతుల చేనులలో నీరు రావడంతో పత్తి పంట నష్టపోయారని, రైతులను ఆదుకోవాలని కోరారు. ఆసిఫాబాద్ మండలం మాలన్ గొంది గ్రామానికి చెందిన సిడాం గంగుకు చెందిన మేకలు వర్షాల కారణంగా మృత్యువాత పడటంతో రూ. 1.50 లక్షల పరిహారం ప్రొసీడింగును బాధితులకు అందజేశారు.ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్, జి. సి. ఓ. కొట్నాక తిరుపతి, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, రోడ్లు భవనాల శాఖ ఈఈ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి దారుణ హత్య



**టీ మీడియా, ఆగస్ట్ 20,గంగాధర :** గంగాధర మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలి దారుణ హత్య మండలంలో కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు గంగాధర మండల కేంద్రానికి చెందిన పెగుడ మల్లవ్వ అనే వృద్ధురాలు ఈనెల 16వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో మల్లవ్వ కుటుంబ సభ్యులు గంగాధర పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా వృద్రాలు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ మొదలుపెట్టారు.దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. గంగాధర మండలం నాగిరెడ్డి పూర్ గ్రామానికి చెందిన గంగరాజు అనే యువకుడి సూచన మేరకు కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన దేవునూరి సతీష్, దేవనూరి శ్రావణ్ అనే యువకులు మల్లవ్వను కిడ్నాప్ చేసి గంభీరావుపేట శివారులోని పెద్దమ్మ స్టేజి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వృద్ధురాలు మల్లవ్వను హత్య చేసి ఆమెపై ఉన్న ఆభరణాలను దోచుకుని, శవాన్ని చెత్తకుప్పలో పడవేసి వెళ్ళిపోయారు. సీసీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులు దేవునూరి సతీష్, దేవనూరి శ్రావణ్ ను పోలీసులు అరెస్టు చేసి వారి నుండి స్విఫ్ట్ డిజైర్ కారు, రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.దేవనూరి సతీష్ పై కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో గంజాయి కేసు, కొట్లాట కేసు నమోదై విచారణలో ఉన్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు గంగరాజు, మరికొందరు సహచరులు పరారీలో ఉన్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గంగరాజు దొరికితే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని తెలిపారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణ, పోలీసు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు.

# విద్యుత్ స్తంభాలపై కేబుళ్లు

### అస్తవ్యస్తంగా ఉండటం వల్లనే ప్రమాదాలు

**టి మీడియా, ఆగస్టు 20, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలో అనేక చోట్ల టీవీ, ఇంటర్నెట్ కేబుళ్ల (వైర్లు) ఏర్పాటులో నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హైదరాబాద్ రామంతాపూర్?లో ఐదుగురి మృతికి కూడా ఇలా రోడ్డుకు అడ్డంగా లాగిన టీవీ కేబుల్ తెగి విద్యుత్ ?లైనుపై పడటమే కారణమని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) అధికారులు ప్రభుత్వానికి నివేదికను అందించారు. ఇలాంటి కేబుళ్ల ఏర్పాటులో చాలామేర ఆపరేటర్లు కనీస నిబంధనలు కూడా పాటించడం లేదని డిస్కంల అధ్యయనంలో అధికారులు గుర్తించారు. ఈ వైర్లు తెగి కరెంటు లైన్లు, స్తంభాలపై పడితే విద్యుద్ఘాతాలతో ప్రాణాలు పోతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ ప్రమాదాలతో ప్రతి సంవత్సరం సుమారు 600 మందికి పైగా చనిపోతున్నారు. వీటిలో మూడోవంతు మరణాలకు మానవ నిర్లక్ష్యమే కారణమని డిస్కంలో పరిశీలనలో గుర్తించారు.

#### నిబంధనలు పట్టవా

నిబంధనల ప్రకారం ఏ ప్రాంతంలోనైనా టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లను భూమి నుంచి కనీసం 18 అడుగులకు పైన మాత్రమే ఏర్పాటు చేయాలి. వీటిని ఏదైనా కరెంటులైను లేదా స్తంభాన్ని తాకేలా తీసుకెళితే తప్పనిసరిగా డిస్కం నుంచి అనుమతి తీసుకోవాలి. కరెంటు స్తంభాలను ఆసరా చేసుకుని వీటిని ఏర్పాటు చేస్తే ఏటా కిరాయిని కూడా డిస్కంలకు చెల్లించాలి. అయితే కేబుళ్ల ఏర్పాటులో నిబంధనలను పాటించడం లేదని డిస్కంలు ఇప్పటికే పలుమార్లు ఆపరేటర్లకు నోటీసులిచ్చాయి. ఈ హెచ్చరికలను పట్టించుకోకుండా కొనసాగిస్తున్న కేబుళ్లను తొలగించాలని విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో చర్యలకు దిగింది. దీనతో స్థానిక నాయకులు, టీవీ, ఇంటర్నెట్ వినియోగదారులు అడ్డుకుంటున్నారు. దీంతో చేసేదేంలేక విద్యుత్ సిబ్బంది చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.

#### విద్యుత్ సిబ్బందికి మామూళ్లు ఇచ్చి

కొన్ని చోట్ల విద్యుత్ సిబ్బందికి మామూళ్లు ఇచ్చి కేబుళ్లను ఇష్టారీతిగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. చిన్న చిన్న రోడ్లపై ఒకవైపు ఇళ్ల నుంచి మరోవైపున ఉన్న నివాసాలకు కేబుళ్లను రోడ్డుకు అడ్డంగా లాగుతున్నారు. ఇవి తక్కువ ఎత్తులో ఉంటే వాహనాలు వెళ్లిన సమయంలో వాటికి తగిలి తెగి విద్యుత్?లైన్లు, స్తంభాలపై పడి వేలాడుతున్నాయి.



#### ఇళ్ల పైనుంచి తక్కువ ఎత్తులో కేబుళ్లు

పలుచోట్ల ఇళ్ల పైనుంచి కేబుళ్లు తక్కువ ఎత్తులో లాగి వదిలేస్తున్నారు. ఇలాంటివి ఎక్కడైనా తెగి కరెంటులైన్లపై పడినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో చాలా చోట్ల స్థానికంగా టీవీ ప్రసారాలకు ఆపరేటర్లు ఎక్కడికక్కడ కేబుళ్లు ఏర్పాటు చేశారు. మరి కొన్నిచోట్ల వాటిని వినియోగించకపోయినప్పటికీ అలాగే వదిలేస్తున్నారు. అవీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

#### యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తాం

టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలుపోతున్నది వాస్తవమేనని దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ అన్నారు. దీనికోసం ఎన్నిసార్లు చెప్పినా ఆపరేటర్లు సరిచేయడం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కేబుళ్లన్నింటినీ మంగళవారం నుంచి యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. దీనికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

#### నివేదికను కోరిన ఎస్‌హెచ్‌ఆర్‌సీ

తాజాగా రామంతాపూర్‌లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనను రాష్ట్ర మానవహక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. ఎస్‌హెచ్‌ఆర్‌సీ ఈ ఘటనకు కారణాలు, బాధిత కుటుంబాలకు పరిహారంపై, ఈ ప్రాంతంలోని భద్రతా చర్యలపై విద్యుత్ శాఖనుంచి నివేదికను కోరింది. దానిని సెప్టెంబర్ 22లోపు ఇవ్వాలని టీఎస్‌ఎస్పీడీఎసీఎల్ సీఎండీకి ఆదేశాలు జారీ చేసింది.

# సంఘటితమైతేనే సమస్యల పరిష్కారం

**-దాస్యం వినయ్‌భాస్కర్**

**టీ మీడియా, ఆగస్ట్ 20,హనుమకొండ :** వృత్తి కులాలు ముఖ్యంగా బీసీ కులాలు సంఘటితం కావలసిన సందర్భం ఏర్పడిందని, అందరూ సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం హనుమకొండ రస్తాలోని వీనస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. నేటి గ్లోబలైజేషన్‌లో కులవృత్తులు, చేతివృత్తులు కనుమరుగవుతున్నాయని, మల్టీ నేషనల్, మల్టీ బ్రాండింగ్ కంపెనీల కారణంగా చిన్న కుటీర పరిశ్రమల అస్తిత్వం దెబ్బతింటోందన్నారు. 2009 నుంచి 2023 వరకు ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం చిరువ్యాపారులు, కులవృత్తిదారులు, స్థానిక వ్యాపారస్తులకు అన్నివిధాల సహకరించానని వివరించారు. స్వర్ణకారుల వృత్తి ఎంతో నైపుణ్యాలతో, శ్రమతో సమ్మిళితమైన కళావృత్తి అని ఆయన కొనియాడారు. మల్టీ నేషనల్ కంపెనీల కారణంగా స్వర్ణకారుల జీవనం, వ్యాపారం గడవడం ఇబ్బందవుతుందని, ఈ ప్రతికూల పరిస్థితుల్లో స్వర్ణకారులు అందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వెండి, బంగారు ఆభరణాల తయారీలో ఆయా వృత్తి కులాల వారే ఉండాలని, ఆ వైపుగా సంఘం కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడిగా పానుగంటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మణింద్రనాథ్, కోశాధికారిగా సతీష్, ఉపాధ్యక్షులుగా బ్రహ్మం, రవి, రాజ్ కుమార్, ప్రసాద్, పూర్ణచందర్, గౌరవ సలహాదారులుగా కోటేశ్వర్ రావు, కమలాకర్, రవీంద్ర, చక్రపాణి, ముఖ్య సలహాదారుగా మధు సుధానాచారి, సహాయ కార్యదర్శులుగా రత్నాకర్, ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా వాసు, వేణు, అనిల్, ప్రణయ్, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, అరవింద్, కిరణ్, శ్రీనివాస్, గాయత్రి ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవా చారి, వెంకట స్వామి, సత్యనారాయణ, పెంటయ్యాచారి, ఈశ్వరప్రసాద్, కమలాకర్, కోటేశ్వర్ రావు, రాజేందర్, కృష్ణమాచారి, రమేష్, శ్రీనివాస్ చారి, జయ సేన, చక్రపాణి, భిక్షపతి, రవీంద్ర, జగన్, జయసాగర్ పాల్గొన్నారు.




# ప్లాట్ యజమానికి బెదిరింపు

### రౌడీషీటర్ శ్రీకాంత్ ప్రియురాలు అరుణ అరెస్టు

**టీ మీడియా, ఆగస్ట్ 20, కోవూరు :** నెల్లూరులో తీవ్ర అలజడి రేపిన రౌడీషీటర్ శ్రీకాంత్ ప్రియురాలు నిడిగుంట అరుణను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఆమెను అదుపులోకి తీసుకొని కోవూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. కోవూరులో ఓ ప్లాట్ యజమానిని బెదిరించిన సివిల్ తగాదా కేసులో ఆమెను అరెస్ట్ చేశారు. అరుణను కోర్టులో హాజరుపరచనున్నారు.సీఐకి ఫోన్ చేసి బెదిరింపులు : అలాగే నాలుగు రోజులు కిందట ఓ సీఐకి ఫోన్ చేసి హోంశాఖ కార్యాలయం నుంచి ఫోన్? చేస్తున్నామంటూ బెదిరింపులు చేశారని మరికొన్ని కేసుల కింద పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో రౌడీషీటర్ శ్రీకాంత్ సహకారంతో పలు నేరాలు, సెటిల్మెంట్లు చేసినట్లు అరుణపై ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో పలువురు పోలీసులు, జైళ్లశాఖల అధికారుల సహకారం కూడా ఆమెకు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో హోం శాఖ ఆదేశాల మేరకు ఆమెపై విచారణ చేస్తున్నారు. అదేవిధంగా అరుణ పూర్తి వ్యవహారాలపై పోలీసులు, నిఘా వర్గాలు విస్తృతంగా ఆరా తీస్తున్నాయి.కారు డిక్కీలో దాక్కుని సెల్ఫీ వీడియో : రెండు రోజులుగా అరుణ బహిరంగంగా ప్రకటనలు చేయడం, ప్రజా ప్రతినిధులతో దిగిన ఫొటోలు బహిర్గతం చేయడం, కొందరు నాయకుల పేర్లు చెబుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించారు. ఆమె చేస్తున్న ప్రకటనల వెనక వైఎస్సార్సీపీ నాయకుల హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చ తీసుకు వచ్చే విధంగా ఆమె తీరు కనిపిస్తుందని కొందరు ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. కరుడుకట్టిన నేరస్థుడు శ్రీకాంత్?తో అరుణకు పలు నేరాలతో సంబంధం ఉన్నట్లు పోలీసులు ఇప్పటికే నివేదికను తయారు చేశారు. అరెస్టుకు ముందు కారు డిక్కీలో దాక్కుని అరుణ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఇదికూడా ప్రచారంలో భాగంగానే పోలీసులు బావిస్తున్నారు.



#### హాస్పిటల్‌లో రాసలీలలు

రౌడీషీటర్ శ్రీకాంత్?కు పెరోల్ మంజూరు చేసిన కూటమి ప్రభుత్వంలో నాయకులు, పోలీసులు వివరాలను ఉన్నతాధికారులు సేకరించారు. శ్రీకాంత్, అరుణ హాస్పిటల్ రాసలీలల వ్యవహారం కావాలనే వీడియో తీసినట్లు, అలాగే తీసిన వ్యక్తి వివరాలు సేకరించారు. శ్రీకాంత్ పెరోల్ రద్దు చేయడానికి ఈ వీడియో కారణమైంది. పెరోల్ మంజూరులో కొందరు ప్రజా ప్రతినిధుల హస్తం ఉన్నట్లు పోలీసులు నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ప్రస్తుతం అరుణ వివాదం నెల్లూరు రాజకీయాలలో తీవ్ర అలజడి రేపింది.

## ఉద్యాన పంటల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**-ఉద్యానవన శాఖ అధికారి ఎం లక్ష్మణ్**



**టీ మీడియా, ఆగస్ట్ 20,కొల్లాపూర్ :** అధిక వర్షాలతో కొల్లాపూర్(డివిజన్ పరిధిలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని ఉద్యానవన శాఖ అధికారి ఎం లక్ష్మణ్పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని ఆదిరాల గ్రామంలో గుమ్మడి తోటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేయడంతో పాటు ఉద్యానవన పంట సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు.

#### కూరగాయలు.

టమాట, వంగ, మిరప , బంతి పంటల నారుమళ్లలో నారు కుళ్లు తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలన్నారు. అధిక వర్షాల వలన కూరగాయల పంటలలో ఆకుమచ్చ తెగులు సోకుటకు అనుకూలమని వివరించారు. ఈ తెగులు నివారణకు ఒక గ్రాము కార్బెండజిమ్ లేదా 1 మి.లీ. ప్రోపికోనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు.

#### మిరప..

ముంపునకు గురైన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10గ్రాముల యూరియా , 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలని వివరించారు.మొక్కలు వడబడి, తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేటు కలిపిన ద్రావణం పిచికారి చేయాలని తెలిపారు.ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదీతో పాటు ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారి చేయాలన్నారు. కాపుతో ఉండి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలని అధికారి లక్ష్మణ్ వివరించారు. నేల అదుసుకు వచ్చిన వెంటనే గొర్రుచేసి అంతరకృషి చేస్తే వెంటనే ఆరుతుంది. దీంతో పాటుగా ఎకరానికి అదనంగా 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలన్నారు. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషణాల మిశ్రమాన్ని , సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని ఒక దాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారి చేయాలన్నారు.పంటపై బాక్టీరియా ఆకుమచ్చ, కొనోఫారా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ , ఒక గ్రాము స్ట్రీప్టోసైక్లిన్ మందులను కలిపిన ద్రావణాన్ని పిచికారి చేస్తే వీటి వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. వేరుకుళ్లు ఆశించిన చేలలో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బండిజమ్ 10 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా ఒక మి.లీ. ప్రోపికోనజోల్ లేదా 0.5 మి. లీ డైఫెన్కోనజోల్ లేదా 2.5గ్రా. కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 2.5 గ్రాము సాఫ్ మందులను లీటరు నీటికి కలిపి, మందులను ఒకటి మార్చి ఒకటి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలన్నారు.పంటను నాశించే వివిధ రకాల గొంగళి పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. వంటి కీటక నాశిని మందులను పిచికారి చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ముఖ్యంగా అధిక వర్షాలతో ఉద్యానవన పంటలు దెబ్బతిన్న వెంటనే తగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చాని తెలిపారు. ఏదైనా సందేహం ఉంటే 91 89777 14460 నెంబర్ కు సంప్రదించాలని రైతులకు సూచించారు.



## మరమ్మతులకు సింగరేణి అధికారుల చర్యలు

**టీ మీడియా, ఆగస్ట్ 20,తాండూర్ :** నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనల సమస్యను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది . కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి , ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ నేతృత్వంలో పలువురు నాయకులు సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి ని కలిసి రోడ్లు, బ్రిడ్జి ల సమస్య తీవ్రతను వివరించారు .సానుకూలంగా స్పందించిన జీఎం ఆదేశాల మేరకు గోలేటి ఏరియా వర్క్ షాప్ ఏజీఎం కృష్ణమూర్తి, ఎస్ఈ నరేష్, బీపీఏ ఓసీపీ-2 మేనేజర్ మహేష్‌లు భీమన్న వాగు , లచ్చుగూడెం వాగు లను పరిశీలించారు . అత్యవసరంగా సమస్యలను పరిష్కరించేవిధంగా లచ్చుగూడెం వద్ద ఇనుప బ్రిడ్జి ని త్వరితగతిన ఏర్పాటు చేసేలా చూస్తామని కృష్ణమూర్తి పేర్కొన్నారు .భీమన్నవాగులో భారీగా పేరుకుపోయిన పూడికను నీటి ప్రవాహం తగ్గగానే తొలగిస్తామన్నారు . పూడిక తొలగిస్తే బ్రిడ్జి సమస్య ఉండబోదన్నారు . ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేలా అన్ని రకాల చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు . సింగరేణి అధికారుల వెంట సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సూరం దామోదర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీశ్ ,గిరిజన నాయకులు ఎం పర్బత్ రావు, మాణిక్ రావు, భగవంత్ రావు, గంగు పటేల్, గంగు, శంకర్, అమృత్ రావు, పర్బత్ రావు, టి తిరుపతి, ఎం తిరుపతి, జె రాజం, సుంగు తదితరులున్నారు